

వేదికపై మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు, పాల్గొన్న ఎమ్మెల్యే షకీల్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు

# బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపిన హరీశ్‌రావు సభ

- నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- వరుస సభల సక్సెస్‌తో ప్రతిపక్షాల బెంబేలు
- షకీల్‌కు సర్కార్‌లో పెద్ద పదవి వస్తుందన్న హరీశ్ మాటలతో నాయకుల్లో హుషారు

బోధన్, నవంబర్ 18: బోధన్ నియోజకవర్గంలోని సాటాపూర్ గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ సభకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకుట్టకుంది. హరీశ్‌రావు ప్రసంగంతోపాటు.. సభకు బోధన్ నియోజకవర్గంలోని రెంజల్, నవీపేట్, ఎడపల్లి మండలాల నుంచి వేలాది మంది జనం తరలిరావడం.. గులాబీ శ్రేణుల్లో సరికొత్త జోష్ నింపింది. సభలో మంత్రి ప్రసంగానికి జనం నుంచి స్పందన కనిపించింది. సాటాపూర్‌లోని ఇస్తేమా మైదానంలో శనివారం నిర్వహించిన బహిరగసభకు ఊహించని రీతిలో జనం రావడంతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎటువంటి దుస్థితి దాపురిస్తుందన్న విషయాలను ప్రజలకు మంత్రి వివరించారు. ప్రధానంగా బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కృషితో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలు, ఆ పనులకు ఎంత ఖర్చుతో చేశారో వివరించారు. మరింత అభివృద్ధి జరగాలంటే.. షకీల్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా హరీశ్‌రావు ప్రసంగం ఉండటంతో సభకు వచ్చిన జనం మండుటెండలో సైతం ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. ఇటీవల బోధన్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్న కులసంఘాల గర్జన సభతోపాటు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమయ్యాయి. ఈ హరీశ్‌రావు సభ కూడా విజయవంతం కావడంతో ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయి. జనం నుంచి స్పందన చూస్తుంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి షకల్ గెలుపు ఖాయమైనట్లేనని పలువురు అంటున్నారు.

**షకీల్‌కు పెద్ద పదవి వస్తుందన్న హరీశ్ మాటలతో జోష్**

ఈ ఎన్నికల్లో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ హ్యాట్రిక్ కొడుతారని, షకీల్‌కు వచ్చే సర్కార్‌లో ప్రమోషన్ లభిస్తుందని, పెద్ద పదవిలో ఆయన ఉంటారని ప్రజా ఆశీర్వాద సభలో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ప్రకటించడం నియోజకవర్గం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. ఈ మాటలను మంత్రి చెబుతున్నప్పుడు సభలోని జనం నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. సభ ప్రారంభంలో ఆష్ట గంగాధర్ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

బహిరంగసభలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రామకిషన్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎం.ఏ.రజాక్, బీఆర్‌ఎస్ రెంజల్, నవీపేట్ మండలాల అధ్యక్షులు భూమ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఇటీవల వైఎస్సార్‌సీపీ పార్టీకి రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరిన గౌతమ్‌ప్రసాద్, సత్యవతి దంపతులు, బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ శంకర్, మౌలానా, వికార్ పాషా, ఏటీఎస్ శ్రీనివాస్, ఖదీర్ ఖాన్, రఫీయోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుడు



సభా ప్రాంగణంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకుడు లతీఫ్‌బేగ్

రెంజల్, నవంబర్ 18: సాటాపూర్‌లో ఎన్నికల ప్రజా ఆశీర్వాద సభకు చేరుకున్న రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సమక్షంలో కందకుర్తి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు లతీఫ్‌బేగ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటున్నప్పటికీ తగిన గుర్తింపు లేక, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు లతీఫ్‌బేగ్ తెలిపారు. కందకుర్తి ఎత్తిపోతల పథకం చైర్మన్‌గా కొన్ని సంవత్సరాలు లతీఫ్‌బేగ్ పనిచేశారు. డాక్టర్ తెలంగాణ శంకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శేషుగారి భూమారెడ్డి, సర్పంచులు ఖలీంబేగ్, గణేశ్‌నాయక్, రాజు, కందకుర్తి ఎంపీటీసీ అసద్‌బేగ్, జిల్లా నాయకుడు రాఘవేందర్‌యాదవ్, మైనార్టీ జిల్లా నాయకులు ఖదీర్‌ఖాన్, రఫిక్, అనీల్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

**సభా ప్రాంగణం పరిశీలన**

సాటాపూర్ శివారులో ఏర్పాటు ప్రజా ఆశీర్వాద సభను ఎన్నికల వ్యాయ అధికారిణి తాయ సింగ్ శనివారం పరిశీలించారు. బోధన్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి హరీశ్‌రావు పాల్గొన్న సభ ప్రంగాణాన్ని ఆమె పరిశీలించారు.

## పాఠశాల తనిఖీ



మాట్లాడుతున్న ఉన్నతి, లక్ష్య రాష్ట్ర పరిశీలకుడు సంజీవ్

బోధన్ రూరల్ , నవంబర్ 18: మండలంలోని కల్దుర్కి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం ఉన్నతి, లక్ష్య రాష్ట్ర పరిశీలకుడు సంజీవ్ తనిఖీ చేశారు. ఉన్నతి,లక్ష్య కార్యక్రమంలో భాగంగా ఆయనతోపాటు సీఎంవో శ్రీనివాస్ తో కలిసి పాఠశాలను సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులతోపాటు కుర్చొని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఉన్నతి, లక్ష్య లక్ష్యాలను ఉపాధ్యాయులకు వివరించారు. పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్ని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎంవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం హనుమంతు, ఉపాధ్యాయులు అంబెల్లి శంకర్, సీఆర్‌పీ బాబు పాల్గొన్నారు.

## ధ్యాన మందిర నిర్మాణానికి భూమిపూజ

నవీపేట, నవంబర్ 18: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి స్పిరిచువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గురువు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఆశయ సాధన కోసం నారాయణపూర్‌లో ధ్యాన మందిరం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన పిరమిడ్ మాస్టర్లు ఇందిరా భాస్కర్‌రావు దంపతుల వ్యవసాయ క్షేత్రంలో ధ్యాన మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీలిమా, విశ్రాంతి జిల్లా పంచాయతీ అధికారి బొడ్డు దయనంద్, మోహన్, సుఖాల, లక్ష్మణ్, భూలక్ష్మి, లలిత, భవాని పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రతినిధులు

## కేటీఆర్ రోడ్డు షో వాయిదా..

బోధన్, నవంబర్ 18: బోధన్ పట్టణంలో ఈ నెల 19న ఆదివారం జరగాల్సిన రాష్ట్ర మున్సిపల్, ఐటీశాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) రోడ్డు షో వాయిదాపడింది. కొన్ని అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదాపడిందని బోధన్ బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. కేటీఆర్ రోడ్డు షో ఈనెల 24 లేదా 25 తేదీల్లో జరిగే అవకాశముందని వారు పేర్కొన్నారు.

## ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

నవీపేట,నవంబర్ 18: మండలంలోని కమలాపూర్ గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించామని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ శనివారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ తరుచూ విధులకు గైర్హాజర్ కావడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కూలీలకు పని కల్పించకపోవడం తదితర అభియోగాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా గ్రామాభివృద్ధి అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కమలాపూర్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వుల్లో డీఆర్‌డీవో పేర్కొన్నారని ఎంపీడీవో పేర్కొన్నారు.

## నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం

శక్కర్‌నగర్, నవంబర్ 18: బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెలా స్వామి వారి కల్యాణ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా నిర్వహిస్తున్న కత్యాణాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని వారు వెల్లడించారు. యజమానులుగా పాల్గొనే భక్తులు, జంటలు తమ పేర్లను ఆలయ పూజారి వద్ద నమోదు చేయించాలని నిర్వాహకులు కోరారు.



నవీపేట మండలం రాంపూర్ నుంచి సభకు బయల్దేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజలు

## మంత్రి సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



ఎడపల్లి మండలం పోచారం గ్రామం నుంచి ..

నవీపేట/ఎడపల్లి, నవంబర్ 18: నవీపేట్ మండలంలోని పలు గ్రామాల నుంచి రెంజల్ మండలం సాటాపూర్ గ్రామంలో నిర్వహించిన ఆశీర్వాద సభకు శనివారం బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ గ్రామాల ఇన్‌చార్జుల నాయకత్వంలో ప్రజలు బయల్దేరారు. రాంపూర్ నుంచి సర్పంచ్ దొంత రుతు కల్పణ, ఎంపీటీసీ గైని లావణ్య, ఉప సర్పంచ్ గైని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఐదు బస్సుల్లో 300 మంది వరకు ప్రజలు తరలి వెళ్లారు.శాటాపూర్ సభకు ఎడపల్లి మండలం నుంచి పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. బోధన్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని అన్నారు.